TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :81 ఆదివారం 21 జూన్ 2026 వేల : 5/-

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad



02



02

## మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

- 22,23 తేదీల్లో ఢిల్లీలోనే ఉంటానన్న సిఎం
- వెంటనే కలసి సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం
- కిషన్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన సిఎం రేవంత్



**హైదరాబాద్,జూన్20(హైదరాబాద్ మిర్రర్)**

హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ పొడిగింపు అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో బహిరంగ లేఖ రాశారు. మెట్రో పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం కావాలని అన్నారు. మెట్రో ఫేజ్-2, ఎల్ అండి టి ఫైనాన్సింగ్‌పై చర్చకు సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీకి సమయం కేటాయించాలని సీఎం రేవంత్ కోరారు. ఇద్దరం కలిసి రైల్వే మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. సంబంధిత ఒప్పందాల పత్రాలతో సమావేశానికి హాజరవుతానని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు.

మిగతా 2 లో

## గత ప్రభుత్వాల సంకెళ్ల నుంచి బెంగాల్‌కు విముక్తి

### బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మోడీ వ్యాఖ్య



**కోల్‌కతా,జూన్20(హైదరాబాద్ మిర్రర్):**

గత ప్రభుత్వాల హయాంలో బందీగా ఉన్న బెంగాల్ సంకెళ్ల నుంచి విముక్తి పొందిందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో రక్తపాతాన్ని, ప్రాణనష్టాన్ని చవిచూసి నప్పటికీ బెంగాల్ తన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కోల్పోలేదని ప్రధాని పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో రాష్ట్రాన్ని భారత్ నుంచి విడదీయడానికి కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించినందుకు ప్రజలు కాంగ్రెస్‌కు, టీఎంసీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఒకే ఒక్క ఎన్నికల తీర్పు తెచ్చిన మార్పు రాష్ట్రవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె ఏర్పాటుకు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని ప్రధాని దుయ్యబట్టారు. ఓటుబ్యాంకు కోసం చొరబాటుదారులను రాష్ట్రంలోకి మమత అనుమతించారని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు భాజపా ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు.



## ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన

**భువనేశ్వర్,జూన్20 (హైదరాబాద్ మిర్రర్)**

ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది.

మిగతా 2 లో

## పాడి రైతుకు ప్రభుత్వం భరోసా



02

- 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు
- పాడి రైతులకు బకాయిల్లేని చెల్లింపులు
- లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
- డిప్యూటీ సీం భట్టి విక్రమార్క వెల్లడి

## బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

బాలలహక్కుల పరిరక్షణ కమిటీ కృషి చేయాలి

సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క సూచన

02



## సర్ ప్రక్రియతలో అప్రమత్తం కావాలి

- ఓట్లు తొలగిపోకుండా జాగ్రత్త పడాలి
- కార్యకర్తలకు మంత్రి తుమ్మల హితవు

**ఖమ్మం,జూన్20(హైదరాబాద్ మిర్రర్)**



సర్‌పై అప్రమత్తంగా లేకపోతే అనేక రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సర్‌లో ఓట్ల తొలగింపు సమయంలో సక్రమంగా గుర్తించాలని అన్నారు. శనివారం ముఖ్య కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు.

మిగతా 2 లో

## మూసీ నిర్వాసితులకు ముందు న్యాయం చేయండి

### ప్రభుత్వానికి బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్

**హైదరాబాద్,జూన్20(హైదరాబాద్ మిర్రర్)**



మూసీ పునరుద్ధరణకు భాజపా వ్యతిరేకం కాదని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. బాధితులకు న్యాయం చేశాక, ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఫణికుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

మిగతా 2 లో

## యోధ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు

### ప్రశంసలు కురిపించిన యూఎస్ అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్,జూన్20(హైదరాబాద్ మిర్రర్)**



లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య తీవ్ర విభేదాలు తలెత్తినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహుపై ట్రంప్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన్ను యోధ ప్రధానమంత్రిగా అభివర్ణించారు.

మిగతా 2 లో

మొదటిపేజీ తరువాయి

# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

హైదరాబాద్,జూన్20(హైదరాబాద్ మిర్రర్)

రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీనీ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంంలో డిప్యూటీ సీఎంతో పాటు పశు సంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.ల్గ÷తుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్బ' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మొదటిపేజీ తరువాయి

# యోధ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు

వాషింగ్టన్ సమీపంలో ఖతార్ కానుకగా ఇచ్చిన నూతన ఎయిర్‌ఫోర్స్ వన్ విమాన ఆవిష్కరణ అనంతరం ట్రంప్ మాట్లాడారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య చక్కటి పోరాటం జరిగిందన్నారు. 'నిస్సందేహంగా మేం ఇజ్రాయెల్‌తో చాలా బాగా పోరాడాం. ఆ దేశంతో మాకు గొప్ప సంబంధాలున్నాయి. మేము చాలా శక్తిమంతంగా ఉన్నాం. ఇక బీబీ(నెతన్యాహు).. ఓ యోధుడి లాంటి ప్రధానమంత్రి. ఆయన్ను అలాగే గుర్తించాలి. ఆ ఘనత ఆయనకు దక్కాల్సిందే' అని ట్రంప్ పేర్కొన్నారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ యుద్ధాన్ని కొనసాగించాలని ఆ దేశ ప్రధాని తీవ్ర రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ట్రంప్ ఈ రకంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక.. లెబనాన్ ప్రాంతంలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను, ముఖ్యంగా లెబనాన్‌పై జరగబోయే దాడుల విషయమై ట్రంప్ ప్రస్తావిస్తూ.. అలాంటి నిర్ణయాలపై నియంత్రణ అవసరమన్నారు. యుద్ధాన్ని ముగించేందుకు టెహ్రాన్‌తో ఒప్పందం కుదిరినప్పటికీ.. లెబనాన్‌లో ఇరాన్ మద్దతుగల హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న పోరాటం పట్ల ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ఓ సంభాషణలోనూ ఆయన నెతన్యాహునుద్దేశించి.. 'నీవు పిచ్చివాడివి. నేను లేకపోతే నువ్వు జైల్లో ఉండేవాడివి. నేనే నిన్ను కాపాడుతున్నాను' అని మాట తూలిన సంగతి తెలిసిందే. కాగా.. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందాన్ని నెతన్యాహు నిర్వీర్యం చేసే అవకాశముందని అమెరికా నిఘా సంస్థలు ట్రంప్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నట్టు ది వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించింది. ఆ నివేదిక ప్రకారం.. హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ సైనిక చర్యలను కొనసాగించేందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ఈ ఏడాది చివర్లో ఇజ్రాయెల్‌లో జాతీయ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లెబనాన్ నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోబోనని, హెజ్‌బొల్లాతో పోరాటాన్ని తీవ్రతరం చేయాలనే తన సంకల్పాన్ని దేశ ప్రజలకు చూపించడంపైనే నెతన్యాహు రాజకీయ మనుగడ ఆధారపడి ఉందని స్థానిక మీడియా సంస్థలు ఉటంకించాయి.

మొదటిపేజీ తరువాయి

# సర్ ప్రక్రియతలో అప్రమత్తం కావాలి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 3,02,800 ఓట్లు ఉంటే అందులో సగం ఓట్లు కూడా మ్యాపింగ్ కాలేదన్నారు. లక్షన్నరకు పైగా ఓట్లు పోయే పరిస్థితి కనపడుతోందన్నారు. ఇప్పటికైనా అప్రమత్తం కావాలని.. ప్రతి ఒక్క ఓటుని కాపాడుకోవాలన్నారు. ఓట్లను కాపాడుకోలేకపోతే భవిష్యత్తు రాజకీయం లేదని వ్యాఖ్యానించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు శాతం ఓట్ల తేడాతోనే గెలవడం జరిగిందని మంత్రి తెలిపారు. సర్ కార్యక్రమంలో 55 శాతానికి పైగా ఓట్లు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అప్రమత్తంగా లేకపోతే తీవ్రంగా నష్టపోతామని అన్నారు. మమతా బెనర్జీ, స్టాలిన్ ఓడిపోవడానికి కారణాలు, పరిస్థితిలు గుర్తు చేసుకోవాలని నాయకులకు సూచించారు. రాజకీయాల్లో ఉండాలనుకునే వారికి జీవన్మరణ సమస్య తప్పదన్నారు. బీజేపీ కావాలని ఓట్లను తొలగిస్తోందని, మరో పార్టీ మరోలా చేస్తోందని రకరకాల ప్రచారాలు వస్తున్నాయన్నారు. ఈ క్లిష్ట పరిస్థితులలో అప్రమత్తంగా లేకపోతే నష్టపోతామని తెలిపారు. అధికారులకు సహకరించాలని, వారితో కలిసి సమన్వయం చేసుకొని ఓట్లను కాపాడుకోవాలని నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు.

మొదటిపేజీ తరువాయి

# ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు కీలక బాధ్యతలు

## ఎఫ్ఏటీఎఫ్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ ఐఏఎస్

న్యూఢిల్లీ,జూన్20(హైదరాబాద్ మిర్రర్)

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు తాజాగా కీలక బాధ్యతలు లభించాయి. టెర్రరిస్టుల ఆర్థికమూలాలు, అక్రమ నగదు రవాణా నెట్వర్క్‌లను దెబ్బతీసేందుకు ఏర్పాటు చేసిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఉగ్రవాదులకు నిధులు అందకుండా అంతర్జాతీయంగా చేపడుతున్న చర్యల్లో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ఇది ఒక భారీ విజయమని వ్యాఖ్యానించారు. ఎఫ్ఏటీఎఫ్‌లో ఒక భారత అధికారికి ఇంతటి కీలక బాధ్యతలు దక్కడం ఇదే తొలిసారి. ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ప్రస్తుతం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సెక్రటరీగా ఉన్నారు. అంతకుముందే, కేంద్ర ప్రభుత్వంతో పాటు పంజాబ్, మధ్యప్రదేశ్‌లో వివిధ స్థాయిల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. మధ్యప్రదేశ్ కేడర్‌లో చీఫ్ సెక్రటరీ గ్రేడ్ అధికారిగా 2025లో పదోన్నతి సాధించారు. గతంలో ఆయన రెవెన్యూ శాఖ అడిషనల్ సెక్రటరీగా ఉన్నారు.ఃనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ డైరెక్టర్‌గా కూడా సేవలందించారు. పరిపాలన, ఆర్థిక అంశాల నిర్వహణలో విశేష గుర్తింపు పొందారు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీకామ్, ఎల్ఎల్‌బీ చేసిన ఆయన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీస్ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా నుంచి సీఎస్(ఇంటర్) కూడా చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలకు సంబంధించి ప్రత్యేక కోర్సు కూడా చేశారు.

మొదటిపేజీ తరువాయి

# మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

తెలంగాణకు హైదరాబాద్ మెట్రో కీలక మౌలిక వసతి ప్రాజెక్టని ఈ సందర్భంగా లేఖలో సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని చెప్పుకొచ్చారు. కాగా, ఈనెల 16వ తేదీన కూడా హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా తాను సిద్ధమేనని రేవంత్ అన్నారు. రైల్వే మంత్రితో వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలన్నారు. ఆ సమావేశానికి సంబంధించి కిషన్ రెడ్డి పిలుపు కోసం తాను ఎదురు చూస్తానని పేర్కొన్నారు. ఇందుకు ఆయనతో వ్యక్తిగత భేటీకీ సిద్ధమేనని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.

# మూసీ నిర్వాసితులకు ముందు న్యాయం చేయండి

సింగరేణి స్కామ్ బయటపడుతుందనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. వర్గపోరు కారణంగానే ప్రాంతీయ పార్టీలు చీలిపోతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫాంలు ఇచ్చారు. కనీస మౌలిక సదుపాయాలు లేని బడులు లెక్కలేనన్ని ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఎలా ఉందో రేవంత్‌రెడ్డి చూడాలి. ప్రైవేటు పాఠశాలలు ఎందుకు పెరుగుతున్నాయి? కేంద్రీయ విద్యాలయాలకు ఉన్న ఆదరణ ప్రభుత్వ బడులకు ఎందుకు లేదు? బ్జడెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి. ఉస్మానియా వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ.. వర్సిటీల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. టీచర్లు, ప్రొఫెసర్లు హక్కుల గురించి మాట్లాడితే సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు.

# బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

హైదరాబాద్,జూన్20(హైదరాబాద్ మిర్రర్)

తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క సూచించారు. అలాగే పిల్లల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడం, పిల్లలపై జరుగుతున్న దుర్వినియోగం మరియు పోక్సో కేసులను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య మరియు సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ అధ్యక్షురాలు సీతా దయాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు మరియు పిల్లల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి మంత్రి వివరించారు. బాల్య వివాహాలు ఇంకా కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నందున వాటిని నివారించాలన్నారు. శాఖలోని ప్రతి అధికారి మరియు సిబ్బంది వాటి నివారణకు కృషి చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ సమావేశంలో పాల్గొని, మహిళలు మరియు పిల్లల సంక్షేమానికి సంబంధించిన విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు తమ అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు ఎన్. మోతి జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారులు , జిల్లా బాలల పరిరక్షణ అధికారులు, అలాగే తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ సభ్యులు మర్రిపల్లి చందన, బండి అపర్ణ గారు, కంచర్ల వందన గౌడ్ గారు, ప్రేమలత అగర్వాల్, గోగుల సరిత బుర్కా వచన్ కుమార్ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

## ఎలాంటి ఒత్తిడికి గురికావదదందన్న సిఎం రేవంత్

## నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు

హైదరాబాద్,జూన్20(హైదరాబాద్ మిర్రర్):



నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

# అన్నివర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

## రైతులకు నరకం చూపిస్తున్న రేవంత్ ప్రభుత్వం

## కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శలు

హైదరాబాద్,జూన్20(హైదరాబాద్ మిర్రర్)

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను నానాయాతన పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పేరుకే ప్రజాపాలన.. వాస్తవానికి ప్రజలను హింసించే పాలనగా సాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు.పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చారని కేపీ వివేకానంద తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి 'రైతు బంధు' డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతకు బంగారు బాట వేశారని పేర్కొన్నారు. కానీ నేడు రేవంత్ రెడ్డి రాక్షస పరిపాలనలో రైతులంతా హింసను అనుభవిస్తున్నారని, రైతులకు నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విత్తనాలు లేవు, యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తూ యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా అని పెట్టారని.. కానీ అది భరోసా కాదు.. రైతు మోసం అని అన్నారు. రైతు భరోసా కింద ఒక్క రైతుకు కూడా డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు. సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేపీ వివేకానంద మండిపడ్డారు.

# రూ.1,100 కోట్ల ప్రభుత్వ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి

## – తహశీల్దార్‌కు ఆకుల సతీష్ విజ్ఞప్తి

నిజాంపేట్ జూన్ 20 (హైదరాబాద్ మిర్రర్):



బాచుపల్లి మండలం పరిధిలోని నిజాంపేట్, బాచుపల్లి గ్రామాలలో సుమారు రూ.1,100 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమణల నుండి కాపాడాలని మరియు కోర్టు తీర్పులపై తక్షణమే అప్పీళ్లు దాఖలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆకుల సతీష్ శనివారం బాచుపల్లి మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు సమర్పించారు.నిజాంపేట్ గ్రామంలోని సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న రూ.600 కోట్ల విలువైన సుమారు 14 ఎకరాల ప్రభుత్వ లావణి పట్టా భూమికి సంబంధించి ఉన్నత న్యాయస్థానంలో రెవెన్యూ రికార్డులను సమర్థవంతంగా సమర్పించకపోవడం వల్ల ప్రభుత్వ ప్రయోజనాలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయని, దీనిపై తక్షణమే హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలని ఆయన కోరారు.అదేవిధంగా నిజాంపేట్ పరిధిలోని సర్వే నంబర్లు 233/23 నుండి 26 లో గల రూ.500 కోట్ల విలువైన మరో 12 ఎకరాల ప్రభుత్వ లావణి పట్టా భూమిని 9(స్త్ర) పట్టా క్లెయిమ్‌ల సాకుతో ప్రైవేట్ ప్లాట్లుగా మార్చి థర్డ్ పార్టీలకు విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పట్లో కౌంటర్లు దాఖలు చేయడంలో జరిగిన వైఫల్యం వల్ల ఈ భూమిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర్వులు వచ్చాయని, దీనిపైనా తక్షణ చట్టపరమైన చర్యలు అవసరమని స్పష్టం చేశారు. దీనితో పాటు బాచుపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 454 లో ఉన్న ప్రభుత్వ భూమి మరియు స్థానిక చెరువు బఫర్ జోన్‌ను ఆక్రమించి ప్రైవేట్ అభివృద్ధి పనుల కోసం రహదారిగా వాడుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ భూ ఆక్రమణల చట్టం 1905 ప్రకారం తక్షణమే నిజాంపేట్, బాచుపల్లి పరిధిలోని వివాదాస్పద ప్రభుత్వ భూములను సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని, ఫోర్జరీ మరియు అక్రమ ఆక్రమణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అత్యంత విలువైన ఈ ప్రజా ఆస్తిని కాపాడటానికి, ప్రభుత్వ రికార్డులను పరిరక్షించడానికి ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ స్థానిక నివాసితుల మద్దతుతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయానికి అందజేశారు.

# స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

## తహశీల్దార్ ద్వారా ప్రభుత్వానికి వినతి పత్రం

సంస్థాన్ నారాయణపురం, జూన్ 20(హైదరాబాద్ మిర్రర్):

తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం పిలుపుమేరకు స్వర్ణకారుల సమస్యల పరిష్కారం కొరుతూ శనివారం సంస్థాన్ నారాయణపురం స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కు వినతి పత్రం అందించడం జరిగింది. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జి.వో.272 సవరణ చేసి దొంగ బంగారం రికవరి కేసుల నుండి కాపాడలని, 50 సంవత్సరాలు దాటిన స్వర్ణకారులకు రూపాయలు 5వేలు పెన్షన్ ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార మండల అధ్యక్షులు దాసోజు వెంకటాచారి,ప్రధాన కార్యదర్శి కొండోజు వెంకటేశ్వర్లు,కోశాధికారి కొండోజు భీష్మాచారి, ఉపాధ్యక్షులు రాచకొండ రమేష్ చారి,వజ్రాల వెంకటాచారి, జిల్లా గౌరవ అధ్యక్షులు సొల్లేటి యాదగిరి చారి,జిల్లా సహాయ కార్యదర్శి రాచకొండ యాదగిరి చారి,గౌరవ అధ్యక్షులు రాచకొండ నిరంజనచారి, కట్ల భాస్కరాచారి,కూరెళ్ళ జలంధరాచారి తదితరులు పాల్గొన్నారు




# యోగతో ఆరోగ్యమే మహాభాగ్యం

## మందమర్రి ఎస్ & పి సిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనం

మందమర్రి,జూన్ 21 (హైదరాబాద్ మిర్రర్)



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మందమర్రి ఎస్ ఁ పి సి ఆధ్వర్యంలో ఆదివారం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు బండి సదానందం ఆధ్వర్యంలో వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలను ప్రదర్శించి వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు.నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరు గుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని అభిప్రాయ పడ్డారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్య క్రమంలో యాక్టింగ్ ఏఎస్ఓ వెంకట్ రెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్ దాస్, ఆఫీస్ సూపరింటెండెంట్ మద్దెల శంకర్, జమేదార్ దశరథం,ఇన్‌స్ట్రక్టర్ ఈర బిక్షపతి తదితరులు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, పాల్గొన్న సిబ్బంది యోగా పట్ల మరింత అవగాహన పెంపొందించుకుని నిరంతరం సాధన కొనసాగించాలని సంకల్పించారు.యోగా దినోత్సవం సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు.

# చిన్నారుల విద్యాభ్యాసానికి శుభారంభం

## సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సంధ్యారాణి

క్యాతనపల్లి,జూన్ 20 (హైదరాబాద్ మిర్రర్ )

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిశెల సంధ్యారాణి,ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారుల విద్యాభ్యాసానికి శుభారంభం చేశారు.ముందుగా సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.అనంతరం డాక్టర్ సంధ్యా రాణి రాజా రమేష్ మాట్లాడుతూ విద్య ప్రతి చిన్నారి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తి వంతమైన సాధనమని పేర్కొన్నారు.చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని తెలిపారు.ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శప్రాయులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత-శ్రీనివాస్,13వ వార్డు కౌన్సిలర్ జక్కుబోయిన మంజుల-కుమార్,కౌన్సిలర్ అర్నె సంధ్యా-సతీష్, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ సిబ్బంది,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# యోగతో ఏకాగ్రత,మానసిక ప్రశాంతత లభిస్తుంది..

## -రోజ్ బడ్స్ స్కూల్ లో ఘనంగా యోగా దినోత్సవం-ప్రధానోపాధ్యాయురాలు బేగం జానీ

-చౌటుప్పల్,జూన్ 20, హైదరాబాద్ మిర్రర్:



యోగ వల్ల విద్యార్థులకు మానసిక ప్రశాంతత లభిస్తుందని రోజ్ బడ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బేగం జానీ తెలిపారు. జూన్ 21 ఆదివారం యోగా దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని, స్థానిక పట్టణ పరిధిలోని రోజ్ బడ్స్ పాఠశాలలో ఒకరోజు ముందుగా శనివారం యోగ కార్యక్రమ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ.. యోగ వల్ల ఏకాగ్రత,మానసిక ప్రశాంతత తో పాటు శారీరక దృఢత్వం పెరుగుతున్నాయని విద్యార్థులకు వివరించారు. యోగా అనేది నిత్యజీవితంలో ఆరోగ్యంగా ఉండడానికి యోగాసనాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఉదయం వేళలో యోగాసనాలు వేసి తమ ఆరోగ్యాన్ని తానే కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ఏకాగ్రతను పెంపొందించడానికి యోగా చాలా ఉపయోగపడుతుందని అన్నారు. యోగ వల్ల పిల్లలో సత్ప్రవర్తన అలవాడడానికి ప్రతిరోజు యోగ నేర్పిస్తున్నామని చెప్పారు. అనంతరం పాఠశాల యోగ శిక్షకురాలు సరిత చిన్నారులకు యోగ తడాసనం, వజ్రాసనం, పద్మాసనం, భుజంగాసనం వంటి ముఖ్యమైన ఆసనాలను చేసి చూపించి విద్యార్థులచే చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ముప్పళ్ల రాజు, రాంబాబు, నజ్మా, శిరీష, రత్న కుమారి, సమీనా,ఝాన్సీ,రాణి, క్రాంతి, భార్గవి,నేహా, యోగ ఉపాధ్యాయురాలు సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.ఎ

# పేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్ రమాదేవి

## తొలకొప్పుల రాములు కుటుంబానికి అండగా

మునుగోడు హైదరాబాద్ మిర్రర్ జూన్ 20 :

మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలోని ఒకటో వార్డ్ ఎస్సీ కాలనీకి చెందిన తోలకోప్పుల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.. విషయం తెలుసుకున్న సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసి ,పేద కుటుంబానికి అండగా నిలిచారు.. కుటుంబసభ్యులను పరామర్శించి ,ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.పోలే వెంకటేశ్వర్లు, దుబ్బ రవి, పందుల లింగస్వామి,బాలస్వామి, శ్రీను, శ్రీకాంత్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



# లక్డారం దళితుల అసైన్డ్ భూముల జోలికి రావొద్దు: ఎమ్మార్పీఎస్

**70 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములు వారికే చెందాలి**

**దళితులకు పట్టా పాస్‌బుక్కు అందించి న్యాయం చేయాలి**

**ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ డిమాండ్**

పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 20:

పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలోని దళితులకు చెందిన అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ డిమాండ్ చేశారు. శనివారం లక్డారం గ్రామంలో బాధిత రైతులతో కలిసి భూములను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 498 లోని 22 ఎకరాల భూమిని దళిత కుటుంబాలు సుమారు 70 సంవత్స రాలుగా సాగు చేసుకుంటూ జీవనాధారంగా వినియోగిస్తున్నాయని తెలిపారు. ఆనాడు పేద భూమిలేని కుటుం బాలకు ఇచ్చిన అసైన్డ్ భూములను ప్రస్తుతం ఎన్టీపీసీ ప్లాంట్ పేరుతో స్వాధీనం చేసుకోవడం అన్యాయమని విమర్శించారు. దళితుల భూములను లాక్కొని వారిని మరింత పేదరికంలోకి నెట్టే చర్యలను ప్రభుత్వం మానుకోవాలని కోరారు. దళితులకు పట్టా పాస్‌బుక్కు అందించి న్యాయం చేయాలని, అసైన్డ్ భూముల జోలికి అధికారులు




వెళ్లవద్దని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకుడు పొట్టోళ్ల వెంకటేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బంద రాజు మాదిగ, మల్లేష్, జీవన్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# పార్టీకి శంకర్ చేసిన సేవలు చిరస్మరణీయం

**మంగపేట,జూన్20,హైదరాబాద్ మిర్రర్**

ఉద్యమకారుడు,మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మలికంటి శంకర్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన అకాల మరణం బాధాకరమని జిల్లా నాయకులు వత్సవాయి శ్రీధర్ వర్మ, తుమ్మ మల్లారెడ్డి, యడ్లపల్లి నర్సింహా రావు మాజీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీ నారాయణ అన్నారు.శనివారం రాజుపేటలో జరిగిన దశదినకర్మలకు పార్టీ నాయకులు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అనంతరం రూ,20,000వేల రూపాయల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు చిలకమర్రి రాజేందర్,కర్రీ శ్యాంబాబు,మాజీ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మల్లూర్ దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం,చదలవాడ సాంబశివరావు,ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, చల్లగురుగుల తిరుపతి,రావుల రమణ, బండ్ల మధుబాబు, వెంకట్ రావు, హుసేన్, కౌసర్, అంకుష్, రాజసాహెబ్, కిరీట్, యూత్ నాయకులు,కర్రీ శ్రీను,పిల్లలమర్రి వేణు నిమ్మగడ్డ ప్రవీణ్,నాగ, గౌని రమేష్, ముప్పారాపు సందీప్, రాజశేఖర్, సోషల్ మీడియా వారియర్స్, బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి, గందం కిషోర్,తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చేపట్టాలి

**కూకట్ పల్లి, బాలానగర్ మండలాల విద్యాశాఖాధికారులకి వినతి పత్రం సమర్పించిన బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు**

**కూకట్ పల్లి, జూన్ 20 (హైదరాబాద్ మిర్రర్) :**

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తూము నిఖిల్ కుమార్, బిఆర్ఎస్ వి రాష్ట్ర నాయకులు అశ్వంత్ కుమార్ కూకట్ పల్లి, బాలానగర్ మండలాల విద్యాశాఖాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలను దోచుకుంటున్నాయని, విద్యను వ్యాపార సంస్థలుగా మార్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేనందువలన పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారని, మౌలిక సదుపాయాలు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా హాజరు శాతం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు, జిల్లా అక్షయ్, సూర్య, పల్లపు గిరీష్, దుర్గా ప్రసాద్, సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.




# మహానీయుడు, ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటం బహూకరణ

**సంస్థాన్ నారాయణపురం,జూన్ 20(హైదరాబాద్ మిర్రర్):**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలోని యస్.వి.ఎల్ ఫంక్షన్ హాల్ లో, ఎడ్ల లింగస్వామి - జ్యోతి దంపతుల వివాహ వేడుకలో, మహనీయుడు, ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని, ఉప్పల పెల్లి బాలు, వలిగొండ యాదయ్య, మాధవ్ పాల్గొని వివాహ శుభాకాంక్షలు తెలియజేసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెళ్లి అనేది రెండు మనసులు ఒప్పందం మాత్రమే అని, స్వర్గం, నరకం లో, ఎక్కడ రాసి ఉండదని వారు అన్నారు.



# గాలి వాన బీభత్సం.. పులువురి ఇండ్లు ధ్వంసం

**-బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.**

**-బిఆర్ఎస్ జిల్లా నాయకులు బాడిశ నాగ రమేష్**





**మంగపేట,జూన్20,హైదరాబాద్ మిర్రర్**

మండలంలో శుక్రవారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. రేకుల షెడ్లు, ఇండ్లు, చెట్లు,విద్యుత్ స్తంభాలను నేలమట్టం చేసింది. వీచిన గాలులతో కురిసిన భారీ వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది.గాలి వాన వల్ల పలు కుటుం బాలు ఇడ్లు కోల్పోయి నిరాశ్రయు లయ్యారు. వివరాల్లోకి వెళితే వాగొడ్డు గూడెం, కత్తిగూడెం గ్రామాలలో ఎస్కే షారుక్, కాయం జయసుధ ,పల్లిశెట్టి రాజేష్ ఇండ్లు గాలివాన బీభత్సానికి పూర్తిగా ధ్వసం కాగా, ఇదే గ్రామానికి చెందిన దాసరి సతీష్ ఇళ్లు పాక్షికంగా ధ్వసం కాగా పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. దీంతో నిలువ నీడ లేక భాదితులు నిరాశ్రయులయ్యారు. రాజుపేట, చుంచుపల్లి, బోరు నర్సాపూర్ గ్రామాలలో విద్యుత్ తీగల పై చెట్లు పడడటంతో విద్యుత్ సరఫరాకి అంత రాయం ఏర్పడింది. గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రాత్రంతా చీకట్లోనే మగ్గాల్సిన పరిస్థితి నెలకొంది.

**బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి**

గాలి వాన బీభత్సానికి ఇళ్లు కోల్పోయి, పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లను శనివారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బాడిశ నాగ రమేష్ పరిశీలించారు.బాధిత కుటుం బాలతో మాట్లాడి అండగా ఉండి ఆదుకుం టామని భరోసా కల్పించి పలు కుటుం బాలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం నాగ రమేష్ మాట్లాడుతూ గాలి వాన బీభత్సానికి ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన మరియు పాక్షికంగా దెబ్బతిన్న బాధిత కుటుం బాలను ప్రభుత్వం ఆదుకోని తగిన నష్ట పరిహారం అంద జేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రెండోవ విడుత ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయా లని కోరారు.ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రొడ్డ సుదర్శన్,నాయకులు కొమరం పుల్లారావు, పండా శ్రీను,సోయం సీతయ్య మండల సంతోష్, మునిగేల మహేష్, నిట్టా బన్ను,బాడిశ శ్రవణ్, కొమరం శివాజీ,పాగా కేశవరావు,సుధాకర్ సానాపురి శేఖర్, వరప్రసాద్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత

**-రూ. 30వేల కోట్ల నిధులు విద్యాశాఖకు కేటాయించడం పట్ల హర్షం-కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్**






**కూకట్ పల్లి, జూన్ 20 (హైదరాబాద్ మిర్రర్) :**

రూ. 30వేల కోట్ల నిధులు విద్యాశాఖకు కేటాయించడం ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధా న్యతని ఇస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. బాలానగర్ మండల పరిధిలోని బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన సందర్భంగా రేణుక, స్ఫూర్తి, విగ్నేష్ లకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గుర్తింపు గౌరవం విద్య ద్వారానే లభిస్తాయని పేర్కొన్నారు .అందరు విద్యార్థులు విజయమే లక్ష్యంగా విద్యలో పోటీపడి చదవాలన్నారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని రమేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, డివిజన్ ప్రెసిడెంట్ సతీష్ గౌడ్, సుధాకర్ రెడ్డి ఏఎంసీ డైరెక్టర్, రవి గౌడ్, నరసింహులు, రాజేష్, గోపాల్ చౌదరి, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# రాగన్నగూడ పోస్టాఫీస్ వద్ద రోడ్డు విస్తరణకు గ్రామస్తుల విజ్ఞప్తి

**తుర్కయంజాల్, హైదరాబాద్ మిర్రర్:**

ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని రాగన్నగూడ గ్రామంలోని పాత పోస్టాఫీస్ భవనం వద్ద ఉన్న టీ-జంక్షన్ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక కాలనీవాసులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఇటీవల పోస్టాఫీస్ భవనానికి నిర్మించిన కాంపౌండ్ గోడ కారణంగా టర్నింగ్ పాయింట్ వద్ద రహదారి ఇరుకుగా మారి, స్కూల్ బస్సులు, కార్లు, ఆటోలు వంటి వాహనాలు మలుపు తిరగడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో వాహనాల సౌకర్యార్థం టర్నింగ్ వద్ద ఉన్న కాంపౌండ్ గోడను మున్సిపాలిటీ అధికారులు తొలగించినట్లు స్థానికులు తెలిపారు. కాలనీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, టర్నింగ్ ప్రాంతంలో ఉన్న భూమి, ప్రభుత్వ భూమే అని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోస్టాఫీస్ భవనానికి ఇంతకుముందు ఉన్న కాంపౌండ్ కంటే 15 అడుగుల మేర వెనక్కి జరిపి కొత్త కాంపౌండ్ నిర్మించాలని కోరారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో రహదారి వెడల్పు సరిపోక పోవడంతో వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. అలాగే రాగన్నగూడలో కొత్త అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు వేగంగా జరుగు తున్నందున భవిష్యత్తులో జనాభా, వాహనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యగా రహదారి విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యలు రాకుండా అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రొక్కం సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,రొక్కం బుచ్చిరెడ్డి మాజీ అధ్యక్షులు మర్రి సుధాకర్ రెడ్డి, నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం విజయవంతం

**ఎన్నికల తేదీని ప్రకటిస్తామన్న మిత్ర హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్**

**కూకట్ పల్లి, జూన్ 20 (హైదరాబాద్ మిర్రర్) :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, హైదర్ నగర్ డివిజన్ మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ నంబర్ 2140/2006)ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సాధారణ సభ్యుల సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు, సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన కాలనీ సభ్యులందరికీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న సభ్యు లందరూ ఏకగ్రీవంగా మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ ఎన్నికలను నిర్వహిం చేందుకు ఆమోదం తెలిపారు. ఎన్నికలను పార దర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని సభ్యులు సూచించారు. ఎన్నికల తేదీ, ఎన్నికల ప్రక్రియ, నామినేషన్లు, ఇతర పూర్తి వివరాలను తదుపరి 24 గంటలలో ప్రకటిస్తామని మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం వెల్లడించింది. కాలనీ అభివృద్ధి కోసం సభ్యులందరూ ఇదే విధంగా సహకరించాలని కార్యవర్గం కోరింది.



# ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజు వసూళ్లను నియంత్రించండి. బి ఆర్ ఎస్ వి డిమాడ్.

(హైదరాబాద్ మిర్రర్) న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజు వసూళ్లను నియంత్రించాలని బి ఆర్ ఎస్ వి డిమాండ్ చేశారు.బి. ఆర్. ఎస్. వి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అమరచింత మండలంలో ఉన్న అన్ని ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజుల నియంత్రణ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మండల విద్యాధికారి కృష్ణవేణికి వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద,మధ్య తరగతి ప్రజలకు ప్రవేట్ స్కూల్లో చదివించాలి అనే ఆశ ఉంటుంది,కానీ ప్రవేట్ స్కూల్ యజమానాలు ఫీజు లను విచ్చలవిడిగా పెంచి, విద్యార్థులను ఇబ్బందికి గురిచేస్తునారు. వీటిని నియంత్రించాల్సిన బాధ్యత మండల విద్యాధికారిగా మీ పైన ఉంటుంది అన్నారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మౌలిక వసతులు సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ వి జిల్లా కోర్డినేటర్ తోకలి రమేష్, మక్తల్ నియోజకవర్గ బి. ఆర్. ఎస్. వి అధ్యక్షుడు రియాజ్ అలీ, బి ఆర్ ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ శివ కుమార్ యాదవ్, మండల బి. ఆర్. ఎస్ నాయకులు సోను,అక్బర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.




# జాతీయ లోక్ అదాలత్ లో 3,909 కేసుల పరిష్కారం

(హైదరాబాద్ మిర్రర్) న్యూస్ ముస్తాబాద్/ సిరిసిల్ల

జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 3,909 కేసులను పరిష్కరించడం జరిగిందని, అందుకు గాను రూ.2,27,71,225/- లను నష్ట పరిహారం మరియు జరిమానాల రూపంలో చెల్లించడం జరిగిందని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ తెలిపారు. పరిష్కరించబడ్డ వాటిలో మోటార్ వాహన ప్రమాద కేసులు 15, సివిల్ తగాదాలు 10, క్రిమినల్ కేసులు 246, సైబర్ క్రైమ్ కేసులు 61, ఎక్సైజ్ కేసులు 09, చెక్ బౌన్స్ కేసులు 04, కుటుంబ తగాదాలు 08, బ్యాంకు కేసులు 86, బిఎస్ఎన్ఎల్ 23, డ్రంక్ అండ్ డ్రైవ్ 1028, ట్రాఫిక్ చలాన్ కేసులు 2419 ఉన్నాయి. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి బి.పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, అదనపు ఎస్పీ డి.చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల - కమ్ -ఎఫ్ఏసీ కార్యదర్శి డిఎల్ఎస్ఎ పి.లక్ష్మణాచారి, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆవునూరి రమాకాంతరావు, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్ ఇతర న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.






# హత్నూర మండలానికి రూ.50 లక్షల సీసీ రోడ్ల కొరకు ఎంపీ నిధులు

## ఎంపీ రఘునందన్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన నాగ ప్రభు గౌడ్

హత్నూర, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 20:



హత్నూర మండలంలోని హత్నూర, దౌల్తా బాద్, చందాపూర్, రెడ్డిఖానాపూర్, మధుర గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం దాదాపు రూ.50 లక్షల నిధులను మంజూరు చేసిన మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు కు మండల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు హత్నూర మండల బీజేపీ అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ అభి వృద్ధికి పెద్దపీట వేస్తున్న నాయకుడు ఎంపీ రఘు నందన్ రావు అని కొనియాడారు. గ్రామాల్లో రోడ్ల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మండల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహ కారంతో మరిన్ని నిధులు తీసుకురావడంలో ఎంపీ చొరవ ప్రశంసనీయమని నాగప్రభు గౌడ్ అన్నారు. గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న ఎంపీకి ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని తెలిపారు.

# రైతు భరోసా, రైతు భీమా పై స్పష్టమైన చర్యలు తీసుకోవాలి.. సబితా రెడ్డి

హైదరాబాద్ మిర్రర్ బాలాపూర్ ప్రతినిధి

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడం, సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచకపోవడం, రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడం, రైతు భీమా ప్రీమియం చెల్లింపుల్లో నిర్లక్ష్యం చూపడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతును రాజుగా నిలబెట్టే విధానాలు అమలు చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పరిస్థితిని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.రైతాంగ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల సరఫరా, రైతు భరోసా, రైతు భీమా అంశాలపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# శీతల బొడ్రాయి పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి రామచందర్ రావుకి ఆహ్వానం

హైదరాబాద్ మిర్రర్ బాలాపూర్ ప్రతినిధి

జూన్20 :



ఈనెల జూన్ 27వ తేదీ బాలాపూర్ లో జరిగే శీతల బొడ్రాయి పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు ని బిజెపి రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కలన్ శంకర్ రెడ్డి ఆహ్వానించారు దీనికి రాంచందర్ రావు తప్పకుండా వస్తాను అని చెప్పడం జరిగింది

# జాతీయ లోక్ అదాలత్ ద్వారా భారీ సంఖ్యలో కేసుల పరిష్కారం

కూకట్ పల్లి, జూన్ 20, (హైదరాబాద్ మిర్రర్):

మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం రోజు కూకట్‌పల్లి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ (నేషనల్ లోక్ అదాలత్ ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. వెంకటేశ్వరరావు , 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ రామ్ ప్రసాద్ , ఇతర న్యాయమూర్తులు, డీసీపీ రితి రాజ్, వారి బృందం, కూకట్‌పల్లి కోర్టు జనరల్ సెక్రటరీ సురేందర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు సంయుక్తంగా ప్రారంభించారు.ఈ జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల కేసులకు సంబంధించిన లిటిగెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరస్పర అవగాహనతో అనేక కేసులు విజయవంతంగా పరిష్కారం కావడం జరిగింది.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు,లిటిగెంట్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నేషనల్ లోక్ అదాలత్ విజయవంతం చేశారు.







# రెవెన్యూ అధికారులపై దాడిని ఖండిస్తూ ఆదిభట్ల సర్కిల్ అధికారుల నిరసన

తుర్కయంజాల్, హైదరాబాద్ మిర్రర్:

తుర్కయంజాల్ లో విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ అధికారులపై ఇటీవల జరిగిన దాడి ఘటనను ఖండిస్తూ శుక్రవారం శంషాబాద్ జోన్ జీహెచ్ఎంసీ ఆదిభట్ల -15, కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు బ్లాక్ బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తుర్కయంజాల్ ప్రాంతంలో భూ వివాదానికి సంబంధించిన విధుల నిర్వహణ కోసం వెళ్లిన రెవెన్యూ అధికారులపై దాడి చేయడం అత్యంత ఖండనీయమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిర్భయంగా నిర్వహించేలా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు, బెదిరింపులు, విధి నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం, సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బిక్షపతి,అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్లు,వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, సిస్టమ్ ఆపరేటర్లు, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# త్రిపుర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ మాణిక్ సర్కార్ కి సిపిఎం శ్రేణుల ఘన స్వాగతం

తుర్కయంజాల్,హైదరాబాద్ మిర్రర్:

మహబూబ్నగర్ జిల్లాలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం నాలుగవ రాష్ట్ర మహాసభ బహిరంగ సభల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తుర్కయం జాల్ కేంద్రానికి చేరుకున్న సందర్భంగా త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ కు సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ ఘన స్వాగతం పలికింది. తుర్కయంజాల్ పరిధిలోని విశ్రాంతి తీసుకునేందుకు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి రెడ్ సెల్యూట్ తెలిపారు. ఆయనను కలిసిన వారిలో రాష్ట్ర పార్టీ సీనియర్ నాయకులు డిజి నరసింహా రావు, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, బి.సామెల్, తుర్కయంజాల్ పార్టీ కార్యదర్శి డి కిషన్,సభ్యులు కుంచం వెంకటకృష్ణ,అరుణ్ కుమార్, సత్యనారాయణ, శ్రీరామ్మూర్తి,శ్రీనివాసులు,భాస్కర్,మాధవరెడ్డి, శంకరయ్య, పురుషోత్తం, వినోద్, సత్యం,నరసింహ, శ్రీకాంత్,మహేష్, తదితర ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.



# పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

## నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిపై కలెక్టర్ భావేష్ మిశ్రా ఆకస్మిక తనిఖీ

(హైదరాబాద్ మిర్రర్) న్యూస్ నిర్మల్ బ్యూరో, జూన్ 20.

పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా స్పష్టం చేశారు. శనివారం నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవల తీరును సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు.ఆసుపత్రిలో అమలవుతున్న ఆన్‌లైన్ ఓపీడీ నమోదు విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, రోజువారీగా ఎంతమంది రోగులు వస్తున్నారు, ఏయే విభాగాలకు ఎక్కువ మంది వస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ వార్డులు, విభాగాలను సందర్శించి రోగులతో మాట్లాడారు. రోగులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు వెంటనే నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. రోగుల సంక్షేమమే ఆసుపత్రి సేవల ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొంటూ, వైద్య సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించ బోమని హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలు విభాగాలను సులభంగా గుర్తించేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ఆసుపత్రి రికార్డులను కచ్చితంగా నిర్వహించడంతో పాటు అన్ని వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సూచించారు. కొత్తగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను పరిశీలించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ గోపాల్ సింగ్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శారదతో పాటు ఆరోగ్య శాఖ



ఉన్నతాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

"నాణ్యమైన వైద్యం ప్రతి పౌరుడి హక్కు"

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యున్నత ప్రమాణాలతో సేవలు అందించాలని, ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ భావేష్ మిశ్రా స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా సేవలు అందించాలని ఆయన సూచించారు.

# అన్నివర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

## రైతులకు నరకం చూపిస్తున్న రేవంత్ ప్రభుత్వం

## కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శలు

**హైదరాబాద్,జూన్20((హైదరాబాద్ మిర్రర్)):**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను నానాయాతన పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పేరుకే ప్రజాపాలన.. వాస్తవానికి ప్రజలను హింసించే పాలనగా సాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు.పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చారని కేపీ వివేకానంద తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి 'రైతు బంధు' డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతకు బంగారు బాట వేశారని పేర్కొన్నారు. కానీ నేడు రేవంత్ రెడ్డి రాక్షస పరిపాలనలో రైతులంతా హింసను అనుభవిస్తున్నారని, రైతులకు నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విత్తనాలు లేవు, యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తూ యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా అని పెట్టారని.. కానీ అది భరోసా కాదు.. రైతు మోసం అని అన్నారు. రైతు భరోసా కింద ఒక్క రైతుకు కూడా డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు.సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేపీ వివేకానంద మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బోరంపేట పీఏసీఎస్ పరిధిలో 632 మంది రైతులకు కేవలం 13 మందికే రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి గజదొంగలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనకపోతే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయదా అని పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ప్రశ్నించారని గుర్తుచేశారు. కేంద్రం వడ్లు కొనుగోలు చేయకపోతే కిషన్ రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తానని శపథం చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు మోదీకి సరెండర్ అయిపోయాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేతగానితనాన్ని, డొల్లతనాన్ని, అసమర్థను ఆయన ప్రకటనలే బయటపెడుతున్నాయని అన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరణ, ఫోర్త్ సిటీ, కాళేశ్వరం రిపేర్లు ఇలా ప్రతిదాంట్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై దుమ్మెత్తిపోస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని.. ఈ చేతగాని ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగురడం, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతాంగానికి చేసిన మోసానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతు బీమా ప్రీమియం చెల్లించాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలను రైతుల ఖాతాలో జమ చేయాలలన్నారు. లేదంటే అసెంబ్లీ వేదికగానే కాకుండా, రోడ్లపైకి వచ్చి ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు వంచైనా రైతుల హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేశారు.

# బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

## వారం పాటు బెయిల్ మంజూరు చేసిన కోర్టు

**హైదరాబాద్,జూన్ 20((హైదరాబాద్ మిర్రర్)):**

కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా భగీరథ్ జైలు జీవితం అనుభవిస్తున్నాడు. తాజాగా ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. ఇక, నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గతంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకుముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారించారు. అప్పటి నుంచి నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.

# నరహరి లాకర్లలో భారీగా డబ్బులు

## కోటిన్నర నగదు స్వాధీనం

## రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు

**హైదరాబాద్,జూన్20((హైదరాబాద్ మిర్రర్)):**

ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి లాకర్లలో భారీగా నగదు, బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. దాదాపు కోటిన్నర నగదుతో పాటు, రెండున్నర కిలోల బంగారు అభరణాలను లాకర్లలో అధికారులు గుర్తించారు. నరహరిపై అవినీతి, అక్రమాస్తుల ఆరోపణలు నేపథ్యంలో ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ దర్యాప్తును ఏసీబీ అధికారులు ముమ్మరం చేశారు. ఈక్రమంలో నరహరికి సంబంధించిన బ్యాంకు లాకర్లను బద్దలు కొట్టి కీలక ఆధారాలను సేకరించారు. నరహరి కుటుంబ సభ్యులు లాకర్ తాళాలను అందించేందుకు నిరాకరించడంతో న్యాయస్థానం అనుమతి తీసుకుని ఏసీబీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ ఆధారంగా బ్యాంకు అధికారుల సమక్షంలో లాకర్లను బద్దలు కొట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ పక్రియ మొత్తం నిబంధనల ప్రకారం జరిగింది. ఈ సోదాల సమయంలో లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లాకర్‌లో రూ.1.50 కోట్ల నగదుతో పాటు సుమారు రెండున్నర కిలోల బంగారం లభించింది. స్వాధీనం చేసుకున్న బంగారం విలువను అధికారులు అంచనా వేస్తున్నారు. లాకర్లలో దొరికిన నగదు, బంగారానికి సంబంధించిన పత్రాలను కూడా ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు రికార్డులు, పన్ను వివరాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. భారీ మొత్తంలో నగదు, బంగారం బయటపడటంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఏసీబీ అధికారులు సేకరించిన ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

# రాధాగాయత్రిని వేధించిన చంపిన భరత్ శ్రీచరణ్

## శ్రీచరణ్ పెద్ద సైకో అన్న స్నేహితురాళ్లు

## విచారిస్తేనే నిజాలు బయటకొస్తాయని వెల్లడి

**హైదరాబాద్,జూన్20((హైదరాబాద్ మిర్రర్)):**

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాధాగాయత్రి తన భర్తతో కలిసి ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి ట్రిప్‌నకి వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఇప్పటికే రాధాగాయత్రి మృతిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తమ కుమార్తె మృతికి అల్లుడు శ్రీచరణ్ కారణం అంటూ ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. ఢిల్లీ వెళ్లక ముందు హైదరాబాద్‌లో ఆమె పని చేశారు. ఈనేపథ్యంలో రాధాగాయత్రి మృతిపై.. తన స్నేహితులు సంచలన విషయాలు వెల్లడించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. గతంలో ఆమెని భర్త మానసికంగా వేధింపులకు గురిచేశాడని మృతురాలి స్నేహితులు ఆరోపించారు. తనకు పదేళ్లుగా రాధాగాయత్రి తెలుసునని ఆమె స్నేహితురాలు చరిత తెలిపారు. రాధాగాయత్రి చాలా మంచి వ్యక్తి అని చెప్పారు. చదువులో ఎప్పుడూ ముందు ఉండేదని.... ఎదుటి వారికి మంచి చేయాలనే మనస్తత్వం ఉందని పేర్కొన్నారు. ఆమె లేదనే విషయాన్ని తాము జీర్ణించుకోలేకపోతున్నామని చెప్పారు. గత ఆరునెలలుగా రాధాగాయత్రి చాలా ఇబ్బందులకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లయ్యాక గాయత్రిని శ్రీ చరణ్ ఎప్పుడూ అనుమానిస్తూనే ఉండేవాడని చెప్పారు. తను చెప్పిన విధంగా ఉండాలని.... ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా అనుమానంతో వేధించేవాడని తెలిపారు. గాయత్రి సైకాలజీలో డిగ్రీ కూడా చదివిందని ప్రస్తావించారు. సైకలాజికల్ ఇబ్బందులతో శ్రీ చరణ్ బాధపడేవాడని ఆమె గుర్తించిందని అన్నారు. ఎన్నిసార్లు హింసించిన భర్త వేధింపులు తట్టుకునేదని.... శ్రీ చరణ్ ప్రవర్తనని మార్చాలనుకుని ప్రయత్నించేదని తెలిపారు. ఆమె చనిపోయిన సమయంలో శ్రీ చరణ్ ఏమి జరిగిందో ఇప్పటికీ ఎందుకు చెప్పట్లేదని స్నేహితురాలు చరిత ప్రశ్నించారు. శ్రీ చరణ్ సైకో ప్రవర్తనతో ఉండేవాడని..... అదే విషయం గతంలో తమతో కూడా గాయత్రి చెప్పిందని పేర్కొన్నారు. గాయత్రి మృతిపై మీడియాలో అనేక విధాలుగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వాస్తవాలు బయటపడేవరకు అవాస్తవాలు ప్రచారం చెయ్యొద్దని కోరుకుంటున్నామని అన్నారు. ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయనే విషయం శ్రీ చరణ్ తల్లిదండ్రులకు తెలుసునని చెప్పుకొచ్చారు. గతంలో యూపీఎస్సీకి గాయత్రి ప్రిపేర్ అవుతానని అడగ్గానే ఆమె భర్త వ్యతిరేకించాడని అన్నారు. అత్తమామలు మాత్రం యూపీఎస్సీ ప్రిపరేషన్‌కి అనుమతి ఇచ్చారని తెలిపారు. పక్కా ప్రణాళికతోనే ముస్సోరికి తీసుకువెళ్లి గాయత్రిని శ్రీ చరణ్ చంపేశాడని ఆరోపించారు. శ్రీ చరణ్ అత్తమామల నుంచి గాయత్రికి ఎలాంటి వేధింపులు లేవని స్పష్టం చేశారు. శ్రీ చరణ్ వేధింపులతో మానసిక ఇబ్బందులకు గాయత్రి గురైందని చెప్పారు. గాయత్రి మృతిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని కోరారు. శ్రీ చరణ్‌ను సమగ్రంగా విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని స్నేహితురాళ్లు తెలిపారు. గాయత్రికి తెలియకుండా శ్రీ చరణ్ ఆమె బ్యాగ్‌లో జీపీఎస్ ట్రాకర్ పెట్టాడని గాయత్రి స్నేహితురాలు రుక్మిణి వెల్లడించారు. గాయత్రి ఎక్కడికి వెళ్లినా ట్రాకర్ ద్వారా కదలికలు తెలుసుకునేవాడని అన్నారు. జీపీఎస్ ట్రాకర్ గుర్తించి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి భర్తపై కేసు పెడదామని గాయత్రి అనుకున్నారని తెలిపారు. సమాజంలో తల్లిదండ్రుల పరువు పోతుందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని అన్నారు. పెళ్లి అయ్యాక చాలా ఇబ్బందులకు గురైందని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కి చెప్పి ఏదో విధంగా సీసీ ఫుటేజ్ వీడియోస్ తీసుకునేవాడని చెప్పుకొచ్చారు. ఆ వీడియోస్ చూపించి ఆమెని ఇబ్బందులకు ఆమె భర్త గురి చేసేవాడని గాయత్రి స్నేహితురాలు రుక్మిణి పేర్కొన్నారు.

# హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

## లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం

## హైడ్రాపై దుష్ప్రచారం తగదు

## మీడియా సమావేశంలో కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్,జూన్20((హైదరాబాద్ మిర్రర్)):**

హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని, కాని దుష్ప్రచారంతో అడ్డుకోరాదని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు. శనివారం హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగనాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా? లేదా? పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు.

# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్,జూన్20((హైదరాబాద్ మిర్రర్)):**

శనివారం బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 220 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 200 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 170 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,46,080 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,33,900 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,09, 560 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# నిరంజన్ కుటుంబానికి బండ్ల గణెఆశ్ అండ

## 5లక్షల సాయంగా చెక్కు అందచేత

**హన్మకొండ,జూన్20((హైదరాబాద్ మిర్రర్)):**

ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న హనుమకొండ బాలుడు నిరంజన్ కుటుంబానికి ప్రముఖ చిత్ర నిర్మాత బండ్ల గణెళిష్ 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించిన సంగతి తెలిసిందే. శనివారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి బండ్ల గణెళిష్ వెళ్లారు. నిరంజన్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్ తరఫున ఐదు లక్షల రూపాయల చెక్‌ను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పవన్ కల్యాణ్ భక్తుడిగా.. ఆయన స్ఫూర్తితో నిరంజన్‌కు ఆర్థిక సాయం చేశాను. దైవసమానులైన పవన్ కల్యాణ్ పరామర్శతో నిరంజన్ విషయం నా దృష్టికి వచ్చింది. మేమందరం ఇలా ఉన్నామంటే పవన్ కల్యాణ్ దయతోనే. నా కూతురి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నా. ఈ రోజు వచ్చి ఆర్థిక సాయం చేయాలనుకున్నాను. నారా భువనేశ్వరి పుట్టిన రోజున ఐదు లక్షల రూపాయలు ఇవ్వడం సంతోషంగా ఉంది. నిరంజన్ బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇప్పుడు రాజకీయాల గురించి మాట్లాడను' అని అన్నారు.

# కవిత బొగ్గుబాయి బాటలో ఉద్రిక్తత

## భూపాల్‌పల్లిలో అడ్డుకున్న పోలీసులు

**జయశంకర్ భూపాలపల్లి,జూన్20((హైదరాబాద్ మిర్రర్)):**

టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత చేపట్టిన బొగ్గుబాయి బాట ఉద్రిక్తతలకు దారితీసింది. సింగరేణి కేటీకే-5 ఇంక్లైన్ గని వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా 'తెలంగాణ రక్షణ సేన' అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేటీకే-5 ఇంక్లైన్ గనికి చేరుకున్నారు. అయితే గని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన కవితను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, టీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కవితకు మద్దతుగా వచ్చిన నాయకులు మెయిన్ గేట్ ఎక్కేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్తత మరింత పెరిగింది. నిరసన మధ్య గేట్‌ను తొలగించడంతో కల్వకుంట్ల కవిత అనుచరులతో కలిసి గని ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఈ ఘటనతో గని పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ప్రియుడి మోజులో రెండేళ్ల కొడుకు హత్య

## ఫిట్స్‌తో చనిపోయాడని భర్తను నమ్మించిన భార్య

## అనుమానంతో పోలీసులకు

## ఫిర్యాదుతో బయటపడ్డ బండారం

**సిద్దిపేట,జూన్20((హైదరాబాద్ మిర్రర్)):**

సిద్దిపేట జిల్లాలో దారుణం జరిగింది. ప్రియుడితో ఏకాంతంగా గడిపేందుకు అడ్డొస్తున్నాడని రెండేళ్ల కొడుకునే ఓ కన్నతల్లి హత్యచేసింది. ఫిట్స్ వచ్చి చనిపోయాడని అందర్నీ నమ్మించింది. కానీ తండ్రికి అనుమానం రావడంతో 20 రోజుల తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన స్వామి క్యాబ్ డ్రైవర్. భార్య జ్యోతి, రెండేళ్ల కుమారుడు హరికృష్ణతో కలిసి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో జ్యోతి నవీన్ అనే వ్యక్తితో అక్రర సంబంధం పెట్టుకుంది. భర్త లేని సమయంలో ప్రియుడిని ఇంటికి పిలుచుకునేది. ఇలా వాళ్లిద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో బాబు తరచూ ఏడుస్తుండటంతో నవీన్ చిరాకు పడ్డాడు. ఈ క్రమంలోనే నీ కొడుకు నాకు నచ్చలేదు.. వాడిని చంపేద్దామని జ్యోతితో చెప్పాడు. అందుకు జ్యోతి కూడా ఓకే చెప్పింది. దీంతో ఇద్దరూ కలిసి ఏడుస్తున్న బాబును.. క్రూరంగా నేలకేసి కొట్టి చంపారు. బాబు చనిపోయిన తర్వాత నాటకమాడిన జ్యోతి.. భర్త స్వామి ఇంటికి రాగానే అకస్మా?త్తుగా ఫిట్స్ వచ్చి బాబు చనిపోయాడని ఏడ్చింది. భార్య మాటలు నమ్మిన స్వామి.. నిజమేనని భావించి.. అదే రోజు రాత్రి మృతదేహాన్ని స్వగ్రామమైన తీగుల్ తీసుకెళ్లి ఖననం చేశాడు. కానీ కొద్దిరోజుల తర్వాత భార్య ప్రవర్తనలో తేడా రావడంతో స్వామికి అనుమానం మొదలైంది. పైగా ఇంట్లో రక్తపు మరకలు కనబడటంతో అది కాస్త బలపడింది. దీంతో తన కొడుకు మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించగా.. జ్యోతి నేరం అంగీకరించింది. ఈ ఘటనలో జ్యోతిని పోలీసులు అరెస్టు చేయగా.. నవీన్ పరారీలో ఉన్నాడు.

# చిట్టీల వ్యాపారం చేస్తున్న టీచర్ సస్పెన్షన్

**హన్మకొండ,జూన్20((హైదరాబాద్ మిర్రర్)):**

చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్‌పై వేటుపడింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జడ్పీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలువల ఎల్లయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈవో గిరిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల కలువల ఎల్లయ్యపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ కోసం కలెక్టర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో నేరం రుజువు కావడంతో డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# మాఇంటి బంగారం ఓపెనింగ్ కలెక్షన్స్ అదుర్స్




సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ చిత్రం తొలిరోజు భారతదేశంలో రూ. 5.35 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఇండియా గ్రాస్ కలెక్షన్ సుమారు రూ. 6.20 కోట్లుగా నమోదుకాగా. దేశవ్యాప్తంగా 2,658 షోలలో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ. 4.50 కోట్ల గ్రాస్ రావడంతో తొలిరోజు వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ. 10.70 కోట్లకు చేరింది. రిజియన్ వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ. 4.75 కోట్ల గ్రాస్‌తో టాప్‌లో నిలిచాయి. కర్ణాటకలో రూ. 90 లక్షలు, తమిళనాడులో రూ. 38 లక్షల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. తెలుగు 2ఆ వెర్షన్‌కు ఆక్యుపెన్సీ రోజంతా పెరుగుతూ వచ్చింది. ఉదయం షోలకు 26.15 శాతం ఉన్న ఆక్యుపెన్సీ, రాత్రి షోలకు 51.38 శాతానికి చేరింది. ప్రీమియం తెలుగు ఇఖఎఖ ఫార్మాట్‌కు 96 శాతం ఓవరాల్ ఆక్యుపెన్సీ నమోదైంది. హైదరాబాద్‌లో దాదాపు హౌస్‌ఫుల్స్ పడగా, రాత్రి షోలకు 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది. 'ఖుషి' 2023 తర్వాత సమంత తెలుగు సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఆ అంచనాలను నిజం చేస్తూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుష, శ్రీముఖి,శ్రీలక్ష్మి కీలక పాత్రల్లో నటించారు.

# అభిమానితో కలసి పుష్ప రీక్రియేట్ చేసిన అల్లు అర్జున్

లుకేమియాతో బాధపడుతున్న చిన్నారి శ్రద్ధ కోరికను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తీర్చారు. మేక్-ఎ-విష్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఆమెను కలిసిన అల్లు అర్జున్, 'పుష్ప' సినిమాలోని పాపులర్ మూమెంట్స్‌ను ఆమెతో కలిసి రీక్రియేట్ చేశారు. ఈ హృదయాన్ని హత్తుకునే వీడియోను అల్లు అర్జున్ టీమ్ షేర్ చేయగా, సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. వీడియోలో అల్లు అర్జున్ నవ్వుతూ హాయ్ శ్రద్దా, ఎలా ఉన్నావ్? అని పలకరించారు. ఆ తర్వాత 'పుష్ప' సినిమాలోని ఐకానిక్ డైలాగ్ చెప్పమని ప్రోత్సహించారు. ఇద్దరూ కలిసి పుష్ప సిగ్నేచర్ బియర్డ్ స్ట్రోక్ చేయగా, అల్లు అర్జున్ చప్పట్లు కొడుతూ 'డ్యామ్ క్యూట్' అని మెచ్చుకున్నారు. చివరగా నువ్వు కోలుకున్న తర్వాత హైదరాబాద్‌కు రా అని చెప్పారు. ఏమవ్వాలనుకుంటున్నావ్ అని అడగగా, శ్రద్ధ డాక్టర్ అవ్వాలని ఉందని బదులిచ్చింది.



# కాక్‌టెయిల్2 కుటుంబ కథా చిత్రం




షాహిద్ కపూర్ హీరోగా రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాక్‌టెయిల్ 2' . ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలో దీని సెన్సార్ సర్టిఫికెట్‌పై షాహిద్ కపూర్ మాట్లాడారు. ఇది కుటుంబకథా చిత్రమని దీనికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో అర్థం కాలేదని అన్నారు. సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించిన ఆయన దీని గురించి మాట్లాడారు. 'ఈ సినిమాలో అభ్యంతరకరమైన, అసభ్య సన్నివేశాలు ఏవీ లేవు. సినిమా మొత్తంలో అలాంటిది ఒక్క సీన్ కూడా ఉండదు. అలాంటి చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆలోచిస్తూనే ఉన్నాను. ఎంత ప్రయత్నం చేసినా నాకు అర్థం కావట్లేదు. ఇది ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగే కథ. కుటుంబ సభ్యులందరితో కలిసి చూసే చిత్రం అని స్పష్టం చేశారు. ప్రేక్షకులు ఈ సినిమా చూసి థియేటర్ నుంచి నవ్వుతూ బయటకు వస్తారని ఆయన అన్నారు. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా లెస్బియన్ లవ్‌స్టోరీ అంటూ జరిగిన ప్రచారాన్ని కూడా కృతిసనన్ తాజాగా ఖండించారు. ఈ చిత్రం ముగ్గురు ప్రధాన పాత్రల చుట్టూ తిరిగే ఓ ఎమోషనల్ డ్రామా అని చెప్పారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు రూ. 13 కోట్లు వసూలుచేసినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ వీకెండ్ కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

# సోషియో ఫాంటసీగా నాగబంధం

## ట్రైలర్‌ను విడుదల చేసిన చిత్ర బృందం




యువ నటుడు విరాట్ కర్ణ, గ్లామరస్ బ్యూటీ నభా నటేష్ జంటగా నటిస్తున్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం' ట్రైలర్‌ను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పిసిఎక్స్ థియేటర్‌లో యూనిట్ సభ్యుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ పతాకాలపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. ట్రైలర్‌లో చూపించిన విజువల్ ఎఫెక్ట్స్ అన్నీ తెలుగు సాంకేతిక నిపుణులే రూపొందించడం విశేషం. పురాతన ఆలయాలు, గ్రాఫిక్స్ విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మన పురాతన విష్ణు ఆలయాలు, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలు, సనాతన ధర్మం మరియు చారిత్రక అంశాల నేపథ్యంలో మైథాలజీ అడ్వెంచర్ స్పెక్టకిల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాలో విరాట్ కర్ణ శివ తరహా మాస్ లుక్‌లో కనిపించనుండగా, చాలా రోజుల తర్వాత నభా నటేష్ పవర్‌ఫుల్ పాత్రలో మెరవబోతోంది. వీరితో పాటు ఐశ్వర్యా మీనన్, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జునైద్ కుమార్ మరియు అబీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు భారీ హైప్ తీసుకొచ్చింది. విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు గ్రాండ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని, ప్రతి రూపాయి తెరపై స్పష్టంగా కనిపిస్తుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న చరిత్రను తర్వాత తరాలకు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుందని హీరో విరాట్ కర్ణ చెప్పారు. 'నాగబంధం' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు మలయాళం, తమిళం, హిందీ భాషల్లో జూలై 03న ప్రేక్షకుల ముందుకు రానుంది.




# ఓటిటిలోకి అర్జున్ బ్లాస్ మూవీ

చాలా రోజుల తర్వాత అర్జున్ తన యాక్షన్‌తో మెప్పించిన చిత్రం 'బ్లాస్ట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జూన్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా వెల్లడించింది. కొన్ని రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ నేడు నెట్‌ఫ్లిక్స్ అధికారిక తేదీని వెల్లడించింది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం తదితరులు నటించారు.



# ప్రేక్షకులను అలరించేలా చిత్రాలు ఉండాల్సిందే

## డబుల్ ఆక్యుపెన్సీ చిత్ర సక్సెస్ మీట్‌లో ఖుష్బూ

మనం నిర్మించే చిత్రాలు ప్రేక్షకులను అలరించేలా ఉండాలని ప్రముఖ నటి ఖుష్బూ పేర్కొన్నారు. అవ్నీ మూవీస్ పతాకంపై రూపొందిన 'డబుల్ ఆక్యుపెన్సీ'చిత్రం గతవారం విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సక్సెస్‌ను పురస్కరించుకుని తాజాగా చిత్రబృందం చెన్నై నగరంలో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఖుష్బూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ఖుష్బూ మాట్లాడుతూ.. 'చిన్న చిత్రం ఇంతటి సక్సెస్ సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. మనం నిర్మించే సినిమా ప్రేక్షకులను అలరించాలి. వారు చెల్లించే డబ్బుకు తగిన విలువ ఉండాలి అని నా భర్త సుందర్ అంటుంటారు. ఈ చిత్రంతో ఆయన మాటలను మేము కూడా నిజం చేశాం. గత కొన్ని రోజులుగా నేను ఎంతో బిజీగా ఉన్నాను. నా పెద్ద కుమార్తె పెళ్ళి పనుల్లో బిజీగా ఉంది. నా భర్త సుందర్ 'పురుషన్' షూటింగ్, పెళ్ళి పనుల్లో క్షణం తీరికలేకుండా ఉన్నారు. నా చిన్న కుమార్తె ఈ చిత్ర నిర్మాణ పనులు చూసుకుంది. ఈ సినిమా నిర్మాణంలో పలు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, వాటిని ఆమె విజయవంతంగా అధిగమించింది. నా పెద్ద కుమార్తె రెండు చిత్రాల్లో నటిస్తోంది. మరో నాలుగు చిత్రాలకు కమిట్ అయింది. గతంలో ఒక హీరోయిన్.. ప్రేమ, పెళ్ళి వంటి అంశాలపై మాట్లాడేందుకు భయపడేది. ఇప్పుడు కాలంతో పాటు అంతా మారిపోయిందని పేర్కొన్నారు.

# ఫ్రెండ్స్ దర్శకుడు జేమ్స్ బరోస్ కన్నుమూత

హాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ పొందిన 'ఫ్రెండ్స్', 'చీర్స్' వంటి ఐకానిక్ అమెరికన్ సిట్‌కామ్‌ల దర్శకుడు జేమ్స్ బరోస్ కన్నుమూశారు. 85 ఏళ్ల బరోస్ శుక్రవారం రాత్రి నిద్రలోనే ప్రశాంతంగా తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఈ విషాద వార్త తెలియగానే హాలీవుడ్ పరిశ్రమతో పాటు 'ఫ్రెండ్స్' వెబ్ సిరీస్ నటీనటులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ తమ ప్రియమైన దర్శకుడికి నివాళులర్పించారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన కెరీర్‌లో జేమ్స్ బరోస్ దాదాపు 1000కి పైగా టెలివిజన్ ఎపిసోడ్‌లకు దర్శకత్వం వహించి రికార్డు సృష్టించారు. 'ఫ్రెండ్స్'తో పాటు చీర్స్, ఫ్రేజియర్, విల్ అండ్ గ్రేస్, ది బిగ్ బ్యాంగ్ థియరీ, టూ అండ్ ఏ హాఫ్ మెన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత కామెడీ షోలను ఆయన రూపొందించారు. తన అద్భుతమైన దర్శకత్వ ప్రతిభకు గానూ ఆయన ఏకంగా 11 ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డులను గెలుచుకున్నారు. జేమ్స్ బరోస్ మరణంపై 'ఫ్రెండ్స్' సిరీస్ నటులు డేవిడ్ శ్విమ్మర్, మాట్ లెబ్లాంక్, లిసా కుడ్రో సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'జిమ్మీ బరోస్ తాను పనిచేసిన ప్రతి నటుడిలోని ఉత్తమ ప్రతిభను బయటకు తీసేవారు. ఆయన కామెడీని మరింత నవ్వించేలా, ఎమోషన్‌ను మరింత హృదయానికి హత్తుకునేలా మార్చేవారు. ఆయన చూపించిన ఆప్యాయత మాకు ఒక కుటుంబంలాంటి సురక్షితమైన అనుభూతిని ఇచ్చింది' అని డేవిడ్ శ్విమ్మర్ భావోద్వేగంగా రాశారు.

# తొలి ఓవర్‌లోనే 23 పరుగులు.. 22 ఏళ్ళ రికార్డు బ్రేక్






ఆఫ్ఘనిస్థాన్‌పై వన్డే సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన భారత్ 2004లో బంగ్లాదేశ్‌పై 22 పరుగుల రికార్డు బద్దలు యశస్వి జైపాల్ చెలరేగడంతో తొలి ఓవర్‌లోనే 23 పరుగులు ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. చెన్నైలోని చిదంబరం స్టేడియంలో శనివారం జరిగిన మూడో, చివరి వన్డేలో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌తో భారత జట్టు వన్డే ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసి 22 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టింది. 219 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు, ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది సింగిల్ కోసం పిచ్‌పై డేంజర్ ఏరియాలో పరుగెత్తడంతో పెనాల్టీ రూపంలో ఐదు పరుగులు అదనంగా లభించాయి.దాంతో టీమిండియా 5/0తో ఇన్నింగ్స్ ఆరంభించింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ వేసిన తొలి ఓవర్‌లో యశస్వి జైస్వాల్ చెలరేగి ఆడటంతో, పెనాల్టీ పరుగులతో కలిపి మొత్తం 23 పరుగులు వచ్చాయి. వైడ్లు, నో-బాల్స్‌తో కలిపి ఈ భారీ స్కోరు నమోదైంది. దీంతో 2004లో బంగ్లాదేశ్‌పై భారత్ నెలకొల్పిన 22 పరుగుల రికార్డు కనుమరుగైంది. ఈ దూకుడైన ఆరంభంతో టీమిండియా కేవలం 28.4 ఓవర్లలోనే ఒక వికెట్ నష్టానికి 224 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనర్లు రోహిత్ శర్మ (79), యశస్వి జైస్వాల్ (110 నాటౌట్) అద్భుతమైన పునాది వేయగా, శ్రేయస్ అయ్యర్ (20 నాటౌట్) కూడా తన వంతు సహకారం అందించాడు.

అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్థాన్‌ను భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ కోలుకోలేని దెబ్బతీశాడు. కేవలం 23 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టడం ద్వారా కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. ఈ వేదికపై ఒక భారత పేసర్‌కు ఇది తొలి ఐదు వికెట్ల ప్రదర్శన కావడం విశేషం. ప్రసిద్ధ్ ధాటికి ఆఫ్ఘన్ జట్టు 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్రమంలో కెప్టెన్ హష్మతుల్లా షాహిది (102) తన తొలి వన్డే సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఒమర్జాయ్ (50)తో కలిసి 105 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అయితే, చివరి వరుస బ్యాటర్లు మరోసారి తడబడటంతో ఆఫ్ఘనిస్థాన్ 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌట్ అయింది.




# విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌పై ఉత్కంఠ.. ఇంగ్లండ్ పర్యటనపై సందిగ్ధత

ఇంగ్లండ్ వన్డే సిరీస్‌కు ముందు విరాట్ కోహ్లీకి ఫిట్‌నెస్ పరీక్ష ఐపీఎల్ ఫైనల్‌లో అయిన గాయం నుంచి కోలుకుంటున్న విరాట్ మెడికల్ రిపోర్టుల ఆధారంగానే సెలక్టర్ల తుది నిర్ణయం వచ్చే వారం భేటీ కానున్న అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ భారత క్రికెట్ జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌పై ఉత్కంఠ నెలకొంది. త్వరలో జరగనున్న ఇంగ్లండ్ పర్యటనలోని వన్డే సిరీస్ కోసం జట్టును ఎంపిక చేసే ముందు అతని లభ్యతపై సందిగ్ధత నెలకొంది. గాయం కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌కు దూరమైన కోహ్లీ ప్రస్తుతం కోలుకుంటున్నాడని, ఫిట్‌నెస్ నివేదికల ఆధారంగానే సెలక్టర్లు తుది నిర్ణయం తీసుకోనున్నారని తెలుస్తోంది. ఐపీఎల్ 2026 ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున 75 పరుగులతో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన విరాట్ కోహ్లీ, అదే మ్యాచ్‌లో తొడ కండరాల గాయానికి గురయ్యాడు. అప్పటి నుంచి లండన్‌లో ఉంటూ పునరావాసం పొందుతున్నాడు. తాజాగా అతను బీసీసీఐకి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో ఫిట్‌నెస్ అసెస్‌మెంట్‌కు హాజరు కానున్నాడు."ఆదివారం ఢిల్లీలోని యశోభూమిలో తన 'వన్8' బ్రాండ్ గ్లోబల్ ప్రీమియర్ ఈవెంట్ ముగిసిన తర్వాత కోహ్లీ ఏ క్షణంలోనైనా ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకావొచ్చు. అంతా సవ్యంగా జరిగితే, ఇంగ్లండ్ వన్డేలకు అతడిని ఎంపిక చేసే అవకాశం ఉంది" అని ఈ పరిణామాలను దగ్గరగా గమనిస్తున్న ఒక అధికారి ఐఏఎన్ఎస్‌కు నేడు తెలిపారు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ వచ్చే వారం సమావేశమై జట్టును ఎంపిక చేయనుంది. ఇటీవలే శ్రీలంకలో ఇండియా 'ఏ' జట్టు ఆడిన ట్రై సిరీస్‌ను పర్యవేక్షించిన అగార్కర్, ఇప్పుడు కోహ్లీ ఫిట్‌నెస్‌పై దృష్టి సారించారు. జూలై 14 నుంచి 19 వరకు బర్మింగ్‌హామ్, కార్డిఫ్, లార్డ్స్ వేదికలుగా జరగనున్న ఈ ముఖ్యమైన సిరీస్‌కు విరాట్ ఎంపిక అనేది అతని ఫిట్‌నెస్ నివేదికలపైనే పూర్తిగా ఆధారపడి ఉంది.

# ప్రసిద్ధ్ కృష్ణకు 5 వికెట్లు.. ఆఫ్ఘన్ కెప్టెన్ అద్భుత సెంచరీ.. టీమిండియా ముందు ఈజీ టార్గెట్




భారత్‌తో మూడో వన్డేలో 218 పరుగులకు ఆలౌటైన ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది సెంచరీతో (102) ఒంటరి పోరాటం 5 వికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించిన ప్రసిద్ధ్ కృష్ణ అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) అర్ధ సెంచరీ చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న మూడో వన్డేలో ఆఫ్ఘనిస్థాన్ జట్టు భారత్ ముందు 219 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత బౌలర్ల ధాటికి ఒక దశలో విలవిల్లాడిన ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌ను కెప్టెన్ హష్మతుల్లా షాహిది (102) అద్భుత సెంచరీతో ఆదుకున్నాడు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్లతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్థాన్‌కు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ తన నిప్పులు చెరిగే బంతులతో ఆఫ్ఘన్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. కేవలం 36 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి ఆఫ్ఘనిస్థాన్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ షాహిది, అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 105 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ఒమర్జాయ్ అర్ధ సెంచరీ తర్వాత ఔటవ్వగా, షాహిది ఒంటరి పోరాటం కొనసాగించాడు. సహచరులు ఒక్కరొక్కరుగా పెవిలియన్‌కు క్యూ కడుతున్నా, కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి 131 బంతుల్లో 102 పరుగులు సాధించాడు.

ఇన్నింగ్స్ చివరి వికెట్‌గా షాహిది ఔటవ్వడంతో ఆఫ్ఘనిస్థాన్ 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ కేవలం 23 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టగా, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే తలో వికెట్ దక్కించుకున్నారు. ఈ సిరీస్ లో ఇప్పటికే తొలి రెండు మ్యాచ్ లు నెగ్గిన భారత్... 2-0తో సిరీస్ ను చేజిక్కించుకుంది. నేటి చివరి మ్యాచ్ లోనూ నెగ్గి సిరీస్ ను క్లీన్ స్వీప్ చేయాలని టీమిండియా కృతనిశ్చయంతో ఉంది.

# సెంచరీతో జైస్వాల్, అర్ధసెంచరీతో హిట్ మ్యాన్... ఇద్దరూ టచ్ లోకి వచ్చారు... ఆఫ్ఘన్ పై టీమిండియా క్లీన్ స్వీప్




మూడో వన్డేలోనూ టీమిండియా జయభేరి ఆఫ్ఘనిస్థాన్‌తో వన్డే సిరీస్ 3-0తో క్లీన్‌స్వీప్ చెన్నై వన్డేలో సంచలన బౌలింగ్‌తో ఐదు వికెట్లు పడగొట్టిన ప్రసిద్ధ్ కృష్ణ భారత్ ఛేదనలో 110 పరుగులతో అజేయ శతకం సాధించిన యశస్వి జైస్వాల్ ధాటిగా ఆడి 79 పరుగులు చేసిన రోహిత్ శర్మ, తొలి వికెట్‌కు 170 పరుగుల భాగస్వామ్యం వృథా అయిన ఆఫ్ఘన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది సెంచరీ చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన మూడో వన్డేలో భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఆఫ్ఘనిస్థాన్‌ను 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. బౌలింగ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ... బ్యాటింగ్‌లో యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ చెలరేగడంతో భారత్ ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. వన్డే కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు ఇదే తొలి సిరీస్ విజయం కావడం గమనార్హం.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్థాన్ నిర్ణయం బెడిసికొట్టింది. ఆరంభం నుంచే భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడ్డాడు. తన కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన (8.2 ఓవర్లలో 23 పరుగులిచ్చి 5 వికెట్లు) చేసి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించాడు. గుర్బాజ్ (5), ఇబ్రహీం జద్రాన్ (11), రహ్మత్ షా (5) వంటి కీలక బ్యాటర్లను స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు పంపి కోలుకోలేని దెబ్బ తీశాడు.ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరో ఎండ్‌లో ఆఫ్ఘన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి 131 బంతుల్లో 102 పరుగులు చేశాడు. అతనికి అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (50) నుంచి కొంత సహకారం లభించడంతో ఆఫ్ఘనిస్థాన్ గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. చివరకు 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆ జట్టు ఆలౌట్ అయింది.అనంతరం 219 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ ఆఫ్ఘన్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. ముఖ్యంగా జైస్వాల్ దూకుడుగా ఆడగా, రోహిత్ తనదైన శైలిలో బౌండరీలు, సిక్సర్లతో అలరించాడు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 170 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి భారత్ విజయాన్ని ఖాయం చేశారు. రోహిత్ శర్మ 69 బంతుల్లో 79 పరుగులు చేసి ఔటయ్యాడు.రోహిత్ ఔటైన తర్వాత తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించిన జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ (20బి) తో కలిసి మిగతా పని పూర్తిచేశాడు. ఈ క్రమంలో 86 బంతుల్లో 110 పరుగులతో అజేయ శతకం సాధించాడు. చివరిలో సిక్స్ కొట్టి జట్టుకు విజయాన్ని అందించడం విశేషం.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No. TGTEL/2026/A1889